రెడ్‌మార్క్ ఇండ్ల వైపు జేసీబీలు?

- మూసీ కూల్చివేతల శిథిలాల తరలింపునకు ఏర్పాట్లు
- 3 దారులపై ఫోకస్.. ఎవరికంటా పడకుండా ప్లాన్

హైదరాబాద్ సిటీబ్యూరో, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): మూసీ వెంట పేదల ఆర్తనాదాలు ఒకవైపు కొనసాగుతుండగా, అధికారులు.. పేదల ఇండ్ల కూల్చివేతలను మరోవైపు కొనసాగిస్తున్నారు. హిమాయత్‌నగర్, సైదాబాద్ పరిధిలో మంగళవారం అధికారులు 150 ఇండ్లను నేలమట్టం చేశారు. వివిధ ప్రాంతాల్లో మరో 940 ఇండ్లకు రెడ్‌మార్క్ కత్తి వేలాడుతున్నది. కూల్చేసిన ఆ 150 ఇండ్ల శిథిలాల తరలింపునకు అధికారులు జేసీబీలను రంగంలోకి దించుతున్నారు. హిమాయత్‌నగర్, సైదాబాద్‌లో కూల్చేసిన ఆ నిర్మాణాల వరకు జేసీబీలు వెళ్లే రోడ్లు లేవు. ఇరుకు రోడ్లతో ఆయా ప్రాంతాలు ముడిపడి ఉన్నాయి. రెడ్‌మార్క్ నిరాకరించిన ఇండ్లను సైతం కూలగొట్టినా జేసీబీలు అక్కడి వరకు వెళ్లలేని పరిస్థితి ఉన్నది. ఈ దశలో శిథిలాల తరలింపునకు జేసీబీలు మూసీలోకి ఎంట్రీ ఇస్తే నిర్వాసితులు అడ్డుకుంటారన్న అనుమానాలు బలంగా ఉన్నాయి. దీంతో అధికారులు రహస్య దారులను పరిశీలిస్తున్నారు. అందుకోసం మూడు మార్గాలను ఎంచుకున్నట్టు తెలిసింది. ఇమ్లీబన్ బస్టాండ్ నుంచి అర కిలోమీటర్ మూసీ మార్గాన్ని అధికారులు పరిశీలించినట్టు తెలిసింది. పురానాపూల్ నుంచి ఒకటిన్నర కిలోమీటరు దూరంతో మూసీ వెంట దారిని కూడా పరిశీలించినట్టు తెలిసింది. ఇంకోవైపు ముసారంబాగ్ నుంచి అంబర్‌పేట్ బ్రిడ్జి మీదుగా ఆ ప్రాంతాలకు చేరుకునేలా ప్లాన్ చేస్తున్నట్టు తెలిసింది. జేసీబీలు శిథిలాల తరలింపుతోపాటు రెడ్‌మార్క్ చేసిన ఇతర నిర్మాణాలనూ కూల్చేయనున్నట్టు ఓ అధికారి తెలిపారు. అయితే అక్కడి పరిస్థితులపై ఆధారపడి ఉంటుందని ఆయన సెలవిచ్చారు.

మూసీది లూటిఫికేషన్

మొదటిపేజీ తరువాయి...

బ్యాంక్‌గా మార్చుకునేందుకే దీన్ని చేపట్టారని, రాహుల్ బావ రాబర్ట్ వాద్రా కూడా వచ్చి మూసీని చూసిపోయారని చెప్పారు. ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీకి డబ్బు కావాలని, కర్ణాటక డిప్యూటీ సీఎం తనకు సీఎం పదవి ఇస్తేనే డబ్బులిస్తా అంటున్నాడని, ఇక మిగిలింది తెలంగాణే కాబట్టి మూసీపై కన్నేశారని, 'ఇది బ్యూటిఫికేషన్ కాదు.. కచ్చితంగా లూటిఫికేషన్' అంటూ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసలు పేదల ఇండ్లపైకి బుల్డోజర్ పంపిస్తున్నదే రాహుల్ గాంధీ అని నిప్పులుచెరిగారు. హర్యానా, యూపీలో బుల్డోజర్ మంచిది కాదంటూనే రాహుల్ గాంధీ తెలంగాణలో బుల్డోజర్ పంపిస్తున్నాడని విమర్శించారు. మాజీ మంత్రి జీ జగదీశ్‌రెడ్డితో కలిసి కేటీఆర్ బుధవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడారు. మూసీ సుందరీకరణకు 1.50 లక్షల కోట్ల ప్రతిపాదన ఎలా వచ్చిందో చెప్పాలని రేవంత్‌రెడ్డిని నిలదీశారు. ఇదివరకే ఎస్‌టీపీలు, బ్రిడ్జి పనులు చేపట్టామని, అయినా లక్షన్నర కోట్లు ఎందుకో చెప్పాలని ప్రశ్నించారు.

కాంగ్రెస్‌కు రిజర్వ్ బ్యాంకు

మూసీలో పెద్ద ఎత్తున డబ్బులు లూటీ చేసేందుకు.. కాంగ్రెస్‌కు రిజర్వ్ బ్యాంక్‌గా మార్చుకునేందుకు రేవంత్‌రెడ్డి పేదల కడుపులు కొడుతూ లక్షలాది మందిని నిరాశ్రయులను చేస్తూ నిర్దయగా వ్యవహరిస్తున్న తీరును తెలంగాణ సమాజం గమనిస్తున్నదని కేటీఆర్ చెప్పారు. కాళేశ్వరం వివరాలపై అసెంబ్లీలో 3 గంటలపాటు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చామని గుర్తుచేశారు. మూసీ సుందరీకరణ వల్ల ఉపయోగాలపై కనీసం 3 నిమిషాలైనా చెప్పేటోడు ఉన్నాడా? అంటూ నిలదీశారు. అసలు ప్రాజె క్టు స్వరూపం ఎలా ఉంటుందో చెప్పేటోడు లేడని ఆగ్రహం వ్యక్తంచేశారు.

సీఎం, మంత్రులకు సయోధ్యలేదు

ముఖ్యమంత్రికి, మంత్రులకు సయోధ్య లేనట్టు ఉన్నదని కేటీఆర్ అనుమానం వ్యక్తంచేశారు. సీఎం, మంత్రుల ప్రకటనలు, మీడియా సమావేశాలను చూస్తే ఇదే అర్థమవుతుందన్నారు. శ్రీధర్‌బాబు మాట్లాడుతూ రూ.1.50 లక్షల కోట్లని ఎవరు చెప్పారని అడుగుతున్నారని, ఆ అభినవ జోసెఫ్ గోబెల్స్ ఎవరంటే ఎనుముల రేవంత్‌రెడ్డేనంటూ ఎద్దేవాచేశారు. గోపనపల్లి ఫ్లై ఓవర్ ఓపెనింగ్ రోజు స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డే చెప్పారని స్పష్టంచేశారు. సీఎం ఆగస్టు 15నే రుణ మాఫీ అయిందని ప్రకటించాడని, అక్టోబర్ 1న వ్యవసాయ శాఖ మంత్రి మాత్రం ఇంకా రుణమాఫీ పూర్తి కాలేదని చెప్పాడన్నారు. సీఎం ఫార్మాసిటీ రద్దు అని ప్రకటిస్తాడని, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి హైకోర్టులో ఫార్మాసిటీ రద్దు కాలేదని చెప్తూ మభ్య పెడుతున్నారని విమర్శించారు. మంత్రులకు శాఖల మీద పట్టు, అవగాహన లేదని, ముఖ్యమంత్రితో సమన్వయం లేదని చెప్పారు. మంత్రివర్గ విస్తరణ కూడా పూర్తిగా చేసుకోలేని దద్దమ్మ ఈ ముఖ్యమంత్రి అంటూ తీవ్ర స్థాయిలో విరుచుకపడ్డారు.

త్వరలో మూసీ సమగ్ర వివరాలు..

కేసీఆర్ ప్రభుత్వంలో రూ.16వేల కోట్లతో మూసీని ఎలా అభివృద్ధి చేయాలనుకున్నామో త్వరలోనే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వెల్లడిస్తానని కేటీఆర్ తెలిపారు. ఎస్‌టీపీలు కట్టాలనుకొని కొన్ని కట్టామని, నాగోల్ పరిధిలో సుందరీకరణ కూడా చేశామని చెప్పారు. రూ.1100 కోట్లతో కొండాపోచమ్మ నుంచి గండిపేట జలాశయానికి గోదావరి జలాలను తెచ్చేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. మూసీ బాధితుల నుంచి 40, 50 లంచ్ మోషన్లు వచ్చినట్టు జస్టిస్ లక్ష్మణ్ స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు. 1.50 లక్షల కోట్లు, లక్షల మంది నిరాశ్రయుల వ్యవహారంపై సీఎం ఎందుకు మాట్లాడటం లేదని, ఢిల్లీకి 23 సార్లు పోయి కనీసం 23 రూపాయలైనా తెచ్చావా? అని ప్రశ్నించారు. ఖమ్మం, మహబూబాబాద్ వరద బాధితులకు ఇప్పటికీ రూపాయి కూడా ఇవ్వలేదని, ప్రభుత్వం పని తీరు ఎలాఉన్నదో చెప్పేందుకు ఇదొక ఉదాహరణ అని చెప్పారు.

కిలోమీటర్‌కు 2700 కోట్లా?

'2400 కిలోమీటర్ల నమామి గంగే ప్రాజెక్టు కిలోమీటర్‌కు రూ.17 కోట్లు ఖర్చయితే మూసీకి కిలోమీటర్‌కు రూ.2700 కోట్లు అవుతాయా? ఇది స్కాం కాకపోతే మరేమిటి?' అని కేటీఆర్ ప్రశ్నించారు. దమ్ముంటే, చేతనైతే మూసీ పరీవాహక ప్రాంతంలో ఇండ్లకు అనుమతులిచ్చిన అధికారుల తాట తీయాలంటూ రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. 2048 వరకు ఈఎంఐ ఉన్నదని, తాను గర్భవతినని, తన ఇల్లు కూల్చితే ఈఎంఐ ఎవరు కట్టాలని, తన కుటుంబం, పుట్టబోయే బిడ్డ పరిస్థితి ఏమిటని ఓ మహిళ ఆందోళన వ్యక్తం చేసిందని, ఈఎంఐలపై బ్యాంకులతో ప్రభుత్వం ఏమైనా మాట్లాడుతుందా? అని ప్రశ్నించారు. మూసీపై దొంగ చాటుగా వచ్చి సర్వేలు చేసిపోతున్నట్టు ప్రజలు చెప్తున్నారన్నారు. అక్కడ కంపెనీలు పెడుతామని చెప్పిన ఒక్క కంపెనీ పేరైనా చెప్తారా? అని నిలదీశారు. హైడ్రా దెబ్బకు రియల్ ఎస్టేట్ దెబ్బతిన్నదని, రిజిస్ట్రేషన్ల ఆదాయం కుదేలైన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు.

కేంద్ర పెద్దల సమ్మతితోనే ఆమోదం

కేంద్రం సమ్మతితోనే హైడ్రాకు అధికారాలిస్తూ ప్రభుత్వం ప్రతిపాదించిన ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదముద్ర వేశారని కేటీఆర్ చెప్పారు. శాసనసభలో అభిప్రాయాలు తీసుకోవాలనే సంస్కారం లేకుండా, హడావుడిగా ఆర్డినెన్స్ ఎందుకు తెచ్చారని నిలదీశారు. ఇప్పటికైనా సమావేశాలు పెట్టి ప్రజలు, ప్రతిపక్షాల సందేహాలను నివృత్తి చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ప్రచారంలో చిన్న పిలగాడు పిలిచినా వస్తానని రాహుల్ గాంధీ చెప్పాడని, మరిప్పుడు ఏడని ప్రశ్నించారు.

మూసీ పరివాహక ప్రాంత బాధితురాలు దుఃఖభారంతో వెళ్లబోసుకుంటున్న గోడును ఆసక్తిగా వింటున్న కేటీఆర్. చిత్రంలో మధుసూదనాచారి, జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి తదితరులు

> మూసీ బ్యూటిఫికేషన్ కాదు.. కచ్చితంగా లూటిఫికేషన్.. ఈ ప్రాజెక్టు రేవంత్‌రెడ్డిది కాదు.. రాహుల్ ప్రాజెక్టు. పేదల ఇండ్లపైకి బుల్డోజర్ పంపిస్తున్నదే రాహుల్ గాంధీ.. -కేటీఆర్

> గతంలో 16వేల కోట్ల అంచనాతో ప్రతిపాదనలు రూపొందించినం. మూసీ సుందరీకరణలో భాగంగా ఎస్‌టీపీలు కట్టాలనుకున్నం.. కొన్ని చోట్ల కట్టినం. నాగోల్ ప్రాంతంలో ఐదు కిలోమీటర్ల పరిధిలో సుందరీకరణ చేసినం. మూసీపై మా విజన్ ఏంటో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అతి త్వరలో వివరాలు వెల్లడిస్తా. -కేటీఆర్

> 2,400 కిలోమీటర్ల నమామి గంగే ప్రాజెక్టు కిలోమీటరుకు రూ.17 కోట్లు ఖర్చయితే.. మూసీ సుందరీకరణలో కిలోమీటరుకు రూ.2700 కోట్లు అవుతాయట! ఇది స్కాం కాక పోతే మరేంటి? దీన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలో ముఖ్యమంత్రి, మంత్రి చెప్పాలి -కేటీఆర్

రేవంత్‌రెడ్డి ఎందుకు మాట్లాడడు?

తనకు తెలిసినంత వరకు మూసీపై ప్రభుత్వం దగ్గర ఎలాంటి రిపోర్ట్ లేదని చెప్పారు. దీనిపై కేంద్రబడ్జెట్‌లో నిధులివ్వలేదని అసెంబ్లీలో చర్చ జరిగినప్పుడు అడిగానని గుర్తుచేశారు. ఆ రోజు మాట్లాడటానికి సీఎం భయపడ్డారని, అయినా మోదీకి వ్యతిరేకంగా మాట్లాడలంటే రేవంత్‌కు భయమని, ఆ రోజే తాము సీఎం ఎందుకు మాట్లాటంలేదని అడిగినా స్పందించలేదని గుర్తుచేశారు. ఆ రోజు డిప్యూటీ సీఎం భట్టిని అడ్డంపెట్టి మాట్లాడించారని చెప్పారు. నమామి గంగేకు నిధులిస్తారు, మూసీ సుందరీకరణకు ఇవ్వలేదని భట్టి ఆరోపించారని, ఆ సందర్భంగా తాను మూసీ డీపీఆర్‌ను కేంద్రానికి సమర్పించారా? అని అడిగితే, డీపీఆర్ సమర్పిస్తే కదా డబ్బు ఇచ్చేది, డీపీఆర్ సిద్ధమవుతున్నది అని చెప్పినట్టు గుర్తుచేశారు.

దమ్ముంటే మంత్రులు మూసీ ప్రాంతాలకు వెళ్లాలి

మల్లన్న సాగర్ కట్టినప్పుడు పునరావాస కాలనీ కట్టి వారిని అక్కడికి తరలించి ప్రాజెక్టు మొదలు పెట్టామని కేటీఆర్ గుర్తుచేశారు. మూసీపై కనీసం ప్రజాభిప్రాయ సేకరణ చేయలేదని, సోషల్, పర్యావరణ సమస్యపై సర్వేలైనా చేశారా? అంటూ ప్రశ్నించారు. హైదరాబాద్‌లో కిర్లోస్కర్ కమిటీ 28వేల అక్రమణలు ఉన్నాయని నివేదిక ఇచ్చిందని, మూసీలో మరో 12 వేల అక్రమణలు ఉన్నాయని తేలిందని, వారికి పునరావాసం లేకుండా ప్రాజెక్టు చేపట్టడం సరికాదన్న ఉద్దేశంతోనే పక్కకు పెట్టామని చెప్పారు. మంత్రులు సెక్యూరిటీ లేకుండా మూసీ ప్రాంతాల్లో పర్యటించాలని సవాల్ విసిరారు. కూల్చివేస్తున్న ఇండ్ల నుంచి వసూలు చేసిన పన్నులన్నీ వాపస్ ఇస్తారా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుకే లక్ష కోట్లు కాలేదని, మూసీకి రూ.1.50లక్షల కోట్లు ఎలా అవుతాయంటూ నిలదీశారు.

పేదలంటే కాంగ్రెస్‌కు కోపమా?

- ఇండ్ల కూల్చివేతపై పునరాలోచించాలి
- అమానవీయ పాలనపై గాంధీలు స్పందించాలి
- మహాత్మాగాంధీ, శాస్త్రి జయంతి వేడుకల్లో కేటీఆర్

హైదరాబాద్, అక్టోబరు 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పట్ల అమానవీయంగా, కర్కశంగా వ్యవహరిస్తుండటం బాధాకరమని బీఆర్ఎస్ వర్కింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. దీనిపై ఢిల్లీలో ఉన్న ప్రస్తుత గాంధీలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ స్పందించాలని, డీపీఆర్ అనేది లేకుండా ఇండ్లు కూలగొట్టే దుర్మార్గమైన ప్రయత్నాలను విరమింపచేయాలని విజ్ఞప్తి చేశారు. జాతిపిత మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్‌శాస్త్రి జయంతి సందర్భంగా బుధవారం తెలంగాణభవన్‌లో వారి చిత్రపటాలకు కేటీఆర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. సమాజంలో ఉండే అత్యంత బలహీనమైన వ్యక్తిని, ఆ సమాజం, ఆ ప్రభుత్వం ఎట్లా ఆదరిస్తున్నాయనే దాని ని బట్టి ఆ ప్రభుత్వ గొప్పతనం తెలుస్తుందని మహాత్మాగాంధీ చెప్పారని గుర్తుచేశారు. తన సత్యాగ్రహంతో భారతజాతినే కాకుండా ప్రపంచాన్ని మేల్కొల్పిన గొప్ప మహనీయుడు మహాత్మాగాంధీ అని స్మరించుకున్నారు. అమెరికాలో మార్టిన్ లూథర్ కింగ్, దక్షిణాఫ్రికాలో నెల్సన్ మండేలా లాంటి నాయకులతోపాటు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తినిచ్చిన గొప్ప వ్యక్తి మహాత్మాగాంధీ అని పేర్కొన్నారు. ప్రభుత్వాలు సమాజంలోని బలహీనుల పట్ల కర్కశత్వంతో వ్యవహరించొద్దని చెప్పారు. ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించింది నిర్మాణాత్మక పనుల కోసమే కానీ, విధ్వంసం సృష్టించేందుకు కాదనే విషయాన్ని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తెలుసుకోవాలని హితవు చెప్పారు. పేదలంతా బాధపడుతున్నారని, ఇండ్లు కూలగొట్టలేమంటూ కూలీలు తిరిగి వెళ్ళిపోయారని పేర్కొన్నారు. తాము రెండున్నర లక్షల ఇండ్లు కడితే, మిమ్మల్ని 5 లక్షల ఇండ్లు కట్టమని ఓటేశారు తప్ప ఉన్న ఇండ్లను కూలగొట్టేందుకు కాదని కేటీఆర్ తెలిపారు. ఇండ్ల కూల్చివేతపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని, మానవత్వంతో ముందడుగు వేయాలని కోరారు. కార్యక్రమంలో శాసనమండలిలో ప్రధాన ప్రతిపక్ష నేత ఎస్ మధుసూదనాచారి, మాజీ మంత్రులు మహమూద్ అలీ, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్సీ ఎల్ రమ ణ, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కాలేరు వెంకటేశ్, అనిల్ జాదవ్, మాజీ ఎంపీలు రావు ల చంద్రశేఖర్‌రెడ్డి, మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, భాస్కర్‌రావు, కోరుకంటి చందర్, జడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవీప్రసాద్, గజ్జెల నగేశ్, చిరుమళ్ల రాకేశ్, మన్నె గోవర్ధన్‌రెడ్డి, కిశోర్‌గౌడ్, బాలరాజు యాదవ్, వాసుదేవరెడ్డి, మేడె రాజీవ్‌సాగర్, బీఆర్ఎస్ నేతలు తుంగ బాలు, కడారి స్వామియాదవ్ పాల్గొన్నారు.

గానద శ్రీకుమార్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి

మూసీ ఒడ్డున ఆగిన మరో గుండె

మొదటిపేజీ తరువాయి...

కూల్చివేస్తారన్న ప్రచారం జోరుగా సాగుతుండడంతో కుమార్ మనోవేదనకు గురవుతున్నాడు. నాలుగైదు రోజులుగా తిండి మానేశాడు. తీవ్ర మనస్థాపానికి లోనయ్యాడు. బుధవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఛాతీలో నొప్పి వస్తుందని కుటుంబ సభ్యులకు చెప్పడంతో వెంటనే అంబులెన్స్‌లో దవాఖానకు తీసుకెళ్తుండా, మార్గమధ్యంలోనే గుండెనొప్పి వచ్చి చనిపోయాడు. మూసీ కూల్చివేతలు ఏమో కానీ.. ప్రభుత్వం ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకున్నదని బస్తీవాసులు ఆరోపించారు.

ప్రభుత్వ హత్యే: జూలకంటి రంగారెడ్డి

న్యూతులసీరాంనగర్ (లంక)లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి పర్యటించారు. మూసీ బాధితులను పరామర్శించి ప్రజల బాధలను అడిగి తెలుసుకున్నారు. శ్రీకుమార్ ఇంటికి వెళ్లి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూల్చివేతలతో ఆందోళన చెందిన శ్రీకుమార్ చనిపోయాడని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే అని అన్నారు. కుమార్ కుటుంబానికి రూ.20 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కూడా ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పేదల ఇండ్ల కూల్చివేతకు వ్యతిరేకం

పేదల ఇండ్ల కూల్చివేతకు సీపీఎం వ్యతిరేకమని ఆ పార్టీ మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి స్పష్టం చేశారు. సీపీఎం హైదరాబాద్ సౌత్‌కమిటీ ఆధ్వర్యంలో చాదర్‌ఘాట్‌లోని మూసానగర్, శంకర్‌నగర్‌లో ప్రభుత్వం కూల్చివేతలు చేపట్టిన ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వ కండ్లుతెరచి పేదలకు న్యాయం చేయాలని, లేకుంటే పోరాటాడుతామని హెచ్చరించారు.

మూసీ బాధితులకు అండగా..

- కోర్టుల్లో మీ కోసం మా లీగల్ సెల్ న్యాయపోరాటం
- బాధితులు రూపాయి కూడా ఖర్చు చేసుకోవాల్సిన అవసరం లేదు
- బాధితులకు న్యాయం జరిగేదాకా అండగా పోరాడుతాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసా
- కిషన్‌బాగ్, బహదూర్‌పుర, లంగర్‌హౌస్ బాధితులకు హామీ
- పెద్దసంఖ్యలో తెలంగాణభవన్‌కు తరలివచ్చిన బాధితులు

బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న బీఆర్ఎస్ పార్టీ లీగల్ సెల్ ప్రతినిధులు

హైదరాబాద్, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మూసీ బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ భరోసా ఇచ్చారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టులో భాగంగా నివాసాలు, ఇండ్లస్థలాలు కోల్పోతున్న బాధితుల పక్షాన తమ పార్టీ లీగల్ సెల్ కోర్టుల్లో న్యాయపోరాటం చేస్తుందని చెప్పారు. బాధితులు రూపాయి కూడా వ్యక్తిగతంగా ఖర్చు పెట్టుకోవద్దని చెప్పారు. మూసీ తీరం వెంట ఇండ్లు, స్థలాలు, ఆస్తులు కోల్పోతున్న కిషన్‌బాగ్, బహదూర్‌పుర, లంగర్‌హౌస్ ప్రాంతాలకు చెందిన బాధితులు బుధవారం తెలంగాణ భవన్‌కు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పలువురు బాధితులు కేటీఆర్‌కు తమ గోడును వెళ్లబోసుకొని కన్నీటి పర్యంతమయ్యారు. బాధితులను ఓదార్చిన కేటీఆర్.. బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. మూసీ సుందరీకరణ ప్రాజెక్టును కాంగ్రెస్ పార్టీ ఏటీఎంగా మార్చుకున్నదని, న్యాయస్థానంలో దానికి సరైన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. బీఆర్ఎస్ లీగల్ సెల్ సభ్యులు ముఖేశ్ చందా, సోఫియా, సిద్ధిఖీ, ఖుషీ తదితరులు బాధితుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం తెలంగాణ భవన్‌లోనే బాధితులకు భోజన ఏర్పాట్లుచేశారు.

మీ తరపున బీఆర్ఎస్ పార్టీ లీగల్ టీం కోర్టుల్లో కొట్లాడుతుంది. అవసరమైతే లంచ్ మోషన్ పిటిషన్ కూడా వేస్తాం. మీకు న్యాయం జరిగేవరకు మీ తరపున మా పార్టీ పోరాడుతుంది. -కేటీఆర్

మా బతుకులు అడ్డమీది కూలీల్లా అధ్వానం

డబుల్ బెడ్రూం ఇండ్లను నలుగురికి కేటాయిస్తున్నారు. మేము అక్కడికి వెళ్తే అక్కడున్న వాళ్లు మమ్మల్ని కొట్టి బయటకు తరిమేస్తున్నరు. పురాణాపూల్ నుంచి జియాగూడ వరకు మావాళ్ల ఇండ్లు ఎన్నో పోతున్నాయి. ప్రభుత్వం పరిహారం ఇవ్వాలి. పునరావాసం కల్పించాలి. కానీ, అక్కడికెళ్లండి.. ఇక్కడికెళ్లండి అని తరుముతున్నరు. మా బతుకులు అడ్డమీది కూలీల కంటే అధ్వానమైనయి. అసలు మా పరిస్థితి ఏమిటో ప్రభుత్వం చెప్పాలి.

-ఫాతిమా బేగం, బహదూర్‌పుర

20 ఏండ్ల క్రితమే మా ఇంటికి రిజిస్ట్రేషన్

20 ఏండ్ల క్రితమే మా ఇంటికి రిజిస్ట్రేషన్ ఉన్నది. ఇంటి పన్ను, కరెంట్, నల్లా బిల్లులూ కడుతున్నాం. మున్సిపాలిటీ సహా ఇతర అన్నింటిలోనూ పన్నులు కడుతూ వస్తున్నాం. ఇప్పుడు ఆ డబ్బు ఎవరిస్తరు? బీఆర్ఎస్ ఉన్నప్పుడు పదేండ్లు ఏనాడూ, ఏ పరేషాన్ లేదు. నేడు రేవంత్‌రెడ్డి ఇల్లు కూల్చి మమ్మల్ని రోడ్డున పడేశాడు. మమ్మల్ని కబ్జాదారులు అంటున్నడు. రేవంత్‌రెడ్డి మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నడు. ఆయనకు కోర్టులోనే జవాబు చెప్తం. వదిలిపెట్టం.

-సాధికాబేగం, కిషన్‌బాగ్

నాలుగైదు రోజులుగా నిద్ర పట్టడంలేదు

మా కండ్ల ముందే మా ఇల్లు పోతుంటే తట్టుకోలేకపోతున్నాం. నాలుగైదు రోజుల నుంచి నిద్ర కూడా పట్టడంలేదు. ఉదయం నుంచి సాయంత్రం దాకా పడిగాపులు పడుతున్నాం. మాకు ఎవ్వరూ భరోసా ఇవ్వడం లేదు. ఓట్లు వేసి గెలిపించిన ముఖ్యమంత్రి ఎవరి కోసం పనిచేస్తున్నడు. మాకు ఇంత అన్యాయం చేస్తడా? ఓట్లప్పుడు ఎంఐఎం నాయకులు ఇండ్ల చుట్టూ తిరిగారు. ఇప్పుడు ఎటుపోయారు. రూపాయి రూపాయి కూడబెట్టి బంగారం మొత్తం అమ్మి ఇల్లు కొన్నాం.

-మల్లికరజ్విక్, మొఘల్‌నగర్

మాయి పక్కా పట్టా భూములు

మూసీ నది వెంట 1940, 1976 సంవత్సరాల నాటి గ్రామాల మ్యాప్‌లు ఉన్నాయి. టీపన్లు ఉన్నాయి. డబ్బు పెట్టి మేము రిజిస్ట్రేషన్ చేసుకున్నాం. ఇండ్లు కట్టుకున్నాం. మా యన్నీ పక్కా పట్టాభూములు. మా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి. ఒకవేళ ప్రభుత్వం మా భూములను తీసుకోవాలనుకొంటే సర్కారు నిబంధనల ప్రకారం మాకు పరిహారం చెల్లించాలి. పునరావాసం కల్పించాలి. కానీ, అలాంటిదేమీ చేయకుండా మమ్మల్ని కబ్జాకోరులుగా చిత్రీకరించడాన్ని మేము సహించం. -ముస్తఫా, కిషన్‌బాగ్

ప్రభుత్వమా? ప్రైవేటు కంపెనీయా?!

- ఇల్లు ఖాళీ చేస్తే రూ.25 వేల నజరానా
- పారితోషికంతోపాటు డబుల్ బెడ్రూం ఇల్లు
- మూసీ నిర్వాసితులకు సర్కార్ దసరా ఆఫర్
- హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి వెల్లడి

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, అక్టోబర్ 2 (నమస్తే తెలంగాణ): ఏండ్ల తరబడి నివాసముంటున్న ఇల్లునొదిలి వెళ్లిపోతే రూ.25వేల పారితోషికం ఇస్తాం.. అనే ప్రకటన ఎప్పుడైనా విన్నారా? చూశారా? మూసీ నిర్వాసితులకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇస్తున్న దసరా ఆఫర్ ఇది. ఈ మేరకు హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారికంగా ప్రకటించారు. 'మూసీ పరివాహక ప్రాంతంలోని వారు స్వచ్ఛందంగా మరో ప్రాంతానికి తరలివెళ్తే.. ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లుతోపాటు రూ.25వేల పారితోషికాన్ని ప్రభుత్వం ఇస్తుంది' అంటూ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సాధారణంగా ఏదైనా ప్రాజెక్టు చేపట్టినప్పుడు జరిగే భూసేకరణకు ఒక విధానం ఉంటుంది. నిర్వాసితులకు ప్రత్యామ్నాయం చూపించి వారిని ఒప్పించాలి. కానీ మూసీ విషయంలో రేవంత్ సర్కార్ బల్డోజర్లను మాత్రమే నమ్ముకున్నది. రెడ్ మార్కింగ్ శాస్త్రీయం గా జరుగలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇక నిర్వాసితులను రాత్రికి రాత్రి ఇండ్లు ఖాళీ చేయాలంటూ దౌర్జన్యం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. ప్రభు త్వం ఒక ప్రైవేటు కంపెనీలా ఆఫర్లు ప్రకటించిందనే విమర్శలు వస్తున్నాయి. మూసీ నిర్వాసితులకు ప్రభుత్వం కేటాయించిన డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయంలో మౌలిక వసతులు లేవు. కేసీఆర్ ప్రభుత్వం నిర్మించిన ఆ ఇండ్లకు మౌలిక వసతులు కల్పించడంలో రేవంత్ సర్కారు ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం వహించింది. ఇప్పుడు రాత్రికిరాత్రి నిర్వాసితులకు ఇండ్లు కావా ల్సి ఉండటంతో వారిని అందులోకి పం పుతున్నది. ఒక్కసారి నిర్వాసితులు పట్టా పుచ్చుకొని డబుల్ బెడ్రూం ఇండ్లవైపు కదిలితే.. ఇక సర్కారు తీరు 'ఓడ మల్ల న్న.. బోడి మల్లన్న'గా తయారవుతుందని పలువురు అనుమానిస్తున్నారు.

మా ఇండ్లపై కాంగ్రెస్ దిష్టి పోవాలి

మూసీ నది చుట్టూ